క్లుప్తంగా

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్థానిక వేంకటాద్రిపై బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా స్వామివారికి గోత్రనామార్చనలు నిర్వహించారు. భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అప్పన్న నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



బాండు స్వీకరిస్తున్న మాధవరావు దంపతులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి నగరంలోని కేఆర్‌ఎం కాలనీకి చెందిన బి.మాధవరావు దంపతులు లక్షా ఒక రూపాయి విరాళం అందించారు. బుధవారం దేవస్థానం పీఆర్‌వో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దాత నుంచి డిప్యూటీ ఈవో సింగం రాధ ఆ నగదును స్వీకరించారు. వారికి ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం కల్పించి, స్వామివారి శేష వస్త్రం, ప్రసాదం, అన్న ప్రసాదం బాండ్‌ను అందజేశారు. ఆలయ పర్యవేక్షణాధికారి బి.సత్యశ్రీనివాస్, ప్రొటోకాల్ పర్యవేక్షణాధికారి పి.సునీల్‌కుమార్, పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

బోటనీ గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ సబ్జెక్టు ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత తప్పనిసరన్నారు. నెట్/స్లెట్/పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు వారి విద్యార్హత, బోధనానుభవం సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు, ఒక సెట్ జెరాక్స్‌తో డెమో క్లాస్ ఇచ్చేందుకు సిద్ధపడి ఈ నెల 21న ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరుకావాల్సిందిగా కోరారు.

జీఎస్టీ సంస్కరణలపై అవగాహన ర్యాలీ



జీఎస్టీ అవగాహనా ర్యాలీలో డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

సబ్బవరం: కేంద్ర ప్రభుత్వం చేసిన జీఎస్టీ సంస్కరణలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు తగ్గిన ధరలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో కళాశాల నుంచి సబ్బవరం మూడు రోడ్ల జంక్షన్ వరకు జీఎస్టీపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జీఎస్టీ సంస్కరణలు, ఏయే వస్తువులపై ఎంత శాతం పన్ను తగ్గిందనే వివరాలతో కూడిన కరపత్రాలను పంచిపెట్టి, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, కామర్స్ అధ్యాపకులు ఎం.గోవిందరావు, కె.రజిని, పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.లెక్కల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం



సురేష్‌ను భార్యకు అప్పగిస్తున్న పోలీసులు

పెందుర్తి: ఇంట్లో భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ వ్యక్తి ఆచూకీని పెందుర్తి పోలీసులు కొనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వేపగుంట సమీపంలోని అప్పలనర్సయ్యకాలనీకి చెందిన రామబరికి సురేష్(44) గత నెల 16న భార్య భారతితో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఎంతకీ అతడి ఆచూకీ తెలియకపోవడంతో ఈ నెల 10న భారతి పెందుర్తి పోలీసులను ఆశ్రయించింది. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సురేష్‌ను మధురవాడ ప్రాంతంలో బుధవారం గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దర్యాప్తులో చురుగ్గా వ్యవహరించిన హెచ్‌సీ సుమిత్‌కుమార్‌ను సీఐ సతీష్‌కుమార్ అభినందించారు.

పురుగు మందుల పిచికారీలో.. ఏమరుపాటు ప్రమాదకరం

వరి పంట ఏపుగా ఎదిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగుళ్ల బెడద కూడా పెరిగింది. దీంతో పంట పొలాల్లో పురుగు మందుల పిచికారీ ఎక్కువయింది. చీడపీడల నివారణ కోసం క్రిమిసంహారక మందుల్ని పిచికారీ చేసే సమయంలో అప్రమత్తంగా లేకపోతే అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. పురుగు మందుల్ని పిచికారీ చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

- ఇటీవల వర్షాలతో పెరిగిన చీడపీడల బెడద
- క్రిమిసంహారక మందుల పిచికారీలో రైతులు బిజీ
- జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయ అధికారులు



మూలస్వయంభూవరంలో ఏపుగా పెరిగిన వరి పంట

పరవాడ: ఖరీఫ్ సీజన్ వరి చేలను పీడించే తెగుళ్ల నివారణకు రైతులు క్రిమిసంహారక మందుల్ని ఆశ్రయిస్తున్నారు. అయితే పిచికారీ సమయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. మండలంలోని తానాం, భర్నికం, పరవాడ, ధర్మారాయుడుపేట, రావాడ, మూలస్వయంభూవరం, వాడచీపురుపల్లి ప్రాంతాల్లో సుమారు 340 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పంటను అగ్గితెగులు, కాండం తొలుచు పురుగు, సుడిదోమ, ఆకుమచ్చ వంటి తెగుళ్లు ఎక్కువగా ఆశించాయి. వీటి నివారణకు పురుగు మందులు జల్లేటపుడు తప్పనిసరిగా తమ సూచల్ని పాటించాలని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు.

ఈ లక్షణాలు గుర్తిస్తే..

పురుగు మందులు సాధారణంగా నోరు, చర్మం, పీల్చే గాలి ద్వారా శరీరంలోనికి చేరుతాయి. మందుల పిచికారీ సమయంలో పొగతాగడం, చేతులు కడుక్కోకుండా ఆహార పదార్థాలు తీసుకోవడం, నీళ్లు తాగడం తదితర చర్యల వల్ల ఆ పురుగు మందుల అవశేషాలు శరీరంలోకి ప్రవేశిస్తాయి. అకస్మాత్తుగా విపరీతమైన తలనొప్పి, కళ్లు తిరగడం, నీరసం, విరేచనాలు, వాంతులు, అతిగా చెమట, నోరెండి దాహం ఎక్కువగా వేయడం, గొంతు, కళ్లు, చెవులు మంటగా అనిపించడం వంటి తదితర లక్షణాలు ఉంటాయి. ఆ సమయంలో వెంటనే పిచికారీ ఆపేసి, ముందుగా నోటిలో వేళ్లను పెట్టి వాంతి చేయించాలి. ఊపిరి తీసుకునే విధంగా చేయాలి. శరీర ఉష్ణోగ్రత పెరిగితే చన్నీటితో పదే పదే తుడవాలి. వీలైనంత వేగంగా వైద్యుల్ని సంప్రదించాలి.



వరి పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

'డ్రోన్'తో సేఫ్

'డ్రోన్' టెక్నాలజీ వ్యవసాయంలో ఓ విప్లవాత్మక సాధనం. సమయం, శ్రమ ఎంతో ఆదా. పైపెచ్చు సురక్షితం. ఆధునిక డ్రోన్లు 10–20 లీటర్ల సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఎకరం పొలంలో పంటకు పురుగు మందుల్ని పావుగంటలో పిచికారీ చేస్తాయి. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేలా రైతుల్ని చైతన్య పరచాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- క్రిమిసంహారక మందులను సాధ్యమైనంత వరకు పంట పొలంలోనే కలుపుకోవాలి. గాలి వీచే దిశలోనే పిచికారీ చేయాలి.
- పిచికారీ చేసే వ్యక్తి తన శరీరాన్ని పూర్తిగా కప్పి ఉండేలా దుస్తుల్ని ధరించాలి. చేతులకు గ్లౌజులు, కళ్లద్దాలు, నోరూ ముక్కు మూసేలా మాస్కులు ధరించడం తప్పనిసరి.
- పిచికారీ సమయంలో నీరు తాగడం, పొగ తాగడం, భోజనం చేయడం వంటివి పూర్తిగా నిషిద్ధం.
- పురుగు మందును కలిపే సమయంలో చేతులు కాకుండా, కర్రను ఉపయోగించాలి.
- ఎండ సమయంలో కాకుండా వాతావరణం చల్లగా ఉన్నప్పుడు పురుగు మందుల్ని పిచికారీ చేయాలి.
- పురుగు మందు కళ్లలో పడితే వెంటనే మంచి నీటితో శుభ్రం చేసుకోవాలి.
- శరీరంపై గాయాలుంటే పురుగు మందులు తగలకుండా జాగ్రత్తపడాలి.
- పిచికారీ చేసే యంత్రాలు పనిచేయకపోతే నోటితో ఊదడం అస్సలు చేయొద్దు.
- పురుగు మందు డబ్బాలను పిల్లలకు అందుకుండా జాగ్రత్త చేయాలి. ఖాళీ డబ్బాలను గొయ్యి తీసి, పూడ్చేయాలి.
- పిచికారీ పూర్తయిన వెంటనే స్నానం చేసి, దుస్తుల్ని శుభ్రం చేసుకోవాలి.

పిచికారీలో అప్రమత్తం



క్రిమిసంహారక మందుల వినియోగంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. ముందుగా పంటను ఆశించిన తెగుళ్లను గుర్తించి వాటి నివారణకు నిపుణుల సూచనల మేరకు క్రిమిసంహారక మందులు వాడాలి. మోతాదుకు మించి పిచికారీ చేస్తే పంట దిగుబడి దెబ్బతినే ప్రమాదం ఉంది. పిచికారీ సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. డ్రోన్ టెక్నాలజీ అందుబాటులో ఉంటే వాటిని సద్వినియోగం చేసుకుంటే మేలు.

– ఎం.రమాదేవి,
మండల వ్యవసాయ అధికారి, పరవాడ

17, 18న ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడల ఎంపిక పోటీలు

సబ్బవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడల ఎంపిక పోటీలు ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ మండల కో ఆర్డినేటర్ అబ్దుల్ రెహమాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్-14 బాలలు జనవరి 1, 2012 తర్వాత, అండర్-17 బాలలు జనవరి 1, 2009 తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హత ఫామ్, ప్లేయర్ ఎంట్రీ ఫామ్, గేమ్ ఎంట్రీ ఫామ్, మిడ్ డే మీల్ ఫామ్‌లను తీసుకురావాల్సి ఉంటుందన్నారు. తవ్వవానిపాలెం జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న మైదానంలో పోటీలు జరుగుతాయన్నారు. 17న బాలురకు, 18న బాలికలకు పోటీలుంటాయని, ఆయా స్కూళ్ల పీఈటీలు, పీడీలు తమ విద్యార్థులతో హాజరుకావాల్సిందిగా కోరారు.

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు



మరమ్మతుల అనంతరం పైప్‌లైన్

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో లీకవుతున్న పైప్‌లైన్‌కు పంచాయతీ అధికారులు మరమ్మతులు చేపట్టి, ప్రజలకు తాగునీరు అందించే చర్యలు తీసుకున్నారు. పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథా శీర్షికన ఈ నెల 9న సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామంలో తుపాను షెల్టర్ వద్ద ఏర్పాటు చేసిన పైపులైన్‌కు రంధ్రం ఏర్పడడంతో తాగునీరు లీకై గ్రామ ప్రజలు అవస్థలు పడేవారు. ఎట్టకేలకు అధికారులు స్పందించి పైపులైన్‌కు ఇటీవల మరమ్మతులు చేపట్టడంతో తాగునీటి వృథాకు అడ్డుకట్ట పడిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

'విద్యుత్' ఫిర్యాదులకు 60 రోజుల్లో పరిష్కారం

సీజీఆర్‌ఎఫ్ ఛైర్మన్ సత్యనారాయణ



విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీజీఆర్‌ఎఫ్ ఛైర్మన్ సత్యనారాయణ

సబ్బవరం: ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారులు తామెదుర్కొనే సమస్యలపై ఫిర్యాదు చేస్తే 60 రోజుల్లో పరిష్కారం చూపిస్తామని విశ్రాంత న్యాయమూర్తి, సీజీఆర్‌ఎఫ్ ఛైర్మన్ బి.సత్యనారాయణ తెలిపారు. సబ్బవరం మండల కేంద్రంలోని ఏపీఈపీడీసీఎల్ సెక్షన్-1 కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం(సీజీఆర్‌ఎఫ్) అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు వినియోగదారుల న్యాయస్థానం ఉందన్న విషయం తెలుసుకోవాలన్నారు. వినియోగదారులు తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదని, ఆన్‌లైన్ విధానంలో ఫిర్యాదుచేసి పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకూ 1045 ఫిర్యాదులు అందాయని, ఆయా సమస్యల్ని ఇప్పటికే పరిష్కరించగా మరో 169 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని సభలో వివరించారు. చిన్న చిన్న సమస్యలపై వినియోగదారులు కోర్టును ఆశ్రయించాల్సిన పని లేదని నేరుగా ఈపీడీసీఎల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చన్నారు. ముందుగా ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్, సమాచార హక్కు చట్టంల గురించి వివరించారు. వినియోగదారుల హక్కుల చట్టాలపై సీజీఆర్‌ఎస్ ఛైర్మన్ సత్యనారాయణతో కలిసి సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై అందించిన వినతుల్ని స్వీకరించారు. కార్యక్రమంలో సంస్థ ఈఈ ఎస్ రామకృష్ణ, డీఈఈ ఎన్.సురేష్, ఏఈఈ ఎం.దుర్గాప్రసాద్, సులోచనరాణి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయురాలికి వృద్ధాశ్రమంలో ఆశ్రయం



అచ్చియ్యమ్మను లయోలా వృద్ధాశ్రమంలో చేర్పిస్తున్న శ్రీనివాస్

పెందుర్తి: కుటుంబ నిరాదరణకు గురైన ఓ వృద్ధురాలికి పోలీసులు, పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ప్రతినిధులు ఆశ్రయం కల్పించారు. పెందుర్తికి చెందిన దాడి అచ్చియ్యమ్మ(74) నిరాదరణకు గురైంది. ఈ క్రమంలో ఇటీవల తనకు ఆశ్రయం కల్పించాలని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్‌ను సంప్రదించింది. దీంతో శ్రీనివాస్ సీఐ కె.వి.సతీష్‌కుమార్‌కు విషయం చెప్పారు. వెంటనే స్పందించిన సీఐ.. అచ్చియ్యమ్మకు ఆశ్రయం కల్పించాల్సిందిగా లయోలా వృద్ధాశ్రమ నిర్వాహకుడు దొడ్డి ప్రకాష్‌కు సూచించారు. బుధవారం ఆమెను ఆశ్రమానికి శ్రీనివాస్ అప్పగించారు.

కూలేందుకు సిద్ధంగా సామాజిక భవనం



పూర్తిగా శిథిలావస్థకు చేరిన వెంకటపతిపాలెం సామాజిక భవనం

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో సుమారు 25 ఏళ్ల క్రితం నిర్మించిన సామాజిక భవనం మరమ్మతులకు గురైంది. భవనం పిల్లర్లు పెచ్చులూడి, ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. గోడలు, శ్లాబ్ బీటలు వారి ఏమాత్రం వర్షం పడినా కారిపోతోంది. గచ్చులు పూర్తిగా పాడయ్యాయి. భవనం శిథిలావస్థకు చేరడంతో లోపలికి వెళ్లేందుకు ఎవరూ సాహసించలేని పరిస్థితి. ప్రస్తుతం భవనం కూలేందుకు సిద్ధంగా ఉండడంతో గ్రామంలో సభలు, సమావేశాలు, పండగల సమయంలో ఈ సామాజిక భవనాన్ని ఉపయోగించలేకపోతున్నారు. డబ్బులు వెచ్చించి ప్రత్యేకంగా డయాస్ ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాన్ని తొలగించి సీఎస్సార్ నిధులతో నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సింహాద్రి ఎన్టీపీసీ అధికారులను సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య కోరారు. దీంతో స్పందించిన ఎన్టీపీసీ అధికారులు సామాజిక భవన స్థితిగతుల్ని ఇటీవల పరిశీలించి వెళ్లారు. త్వరితగతిన నూతన భవనం నిర్మాణానికి ఎన్టీపీసీ యాజమాన్యం చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనుమతి లేని బాణసంచాపై కఠిన చర్యలు



కె.వి.సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

పెందుర్తి: దీపావళి సందర్భంగా బాణసంచా అమ్మకాలు, రవాణా, నిల్వలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా అమ్మకాలు జరిపేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏటా చాలామంది వ్యాపారులు ముందస్తు అనుమతుల్లేకుండా బాణసంచా స్టాళ్లు పెట్టడం, తగిన జాగ్రత్తలు తీసుకోకుండా అమ్మకాలు జరపడం గుర్తించామన్నారు. వ్యాపారాల్లో మైనర్లను వినియోగించడం నేరమన్నారు. ఇలాంటి వాటిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే పోలీస్ స్టేషన్ పరిధిలోని పార్లపాలెంలో అక్రమంగా భారీ ఎత్తున నిల్వ ఉంచి బాణసంచాను గుర్తించి, ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి జైలుకు పంపామన్నారు. బాణసంచా అమ్మకాలకు స్టాళ్లు పెట్టాలనుకునేవారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. స్టాళ్ల వద్ద తగిన పార్కింగ్ సదుపాయం, పూర్తిస్థాయి భద్రత ఏర్పాట్లు చూశాకే అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు. ఒక దుకాణం అనుమతిపై రెండుస్టాళ్లు ఏర్పాటు చేస్తే తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా బాణాసంచా అక్రమ తయారీ, నిల్వ, అమ్మకాలు ఉన్నట్లు తెలిస్తే వెంటనే 112 లేదా 96767 97314, 94407 96039 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

'బల్క్ డ్రగ్' ఉద్యమంపై నిర్బంధం దుర్మార్గం



రాస్తారోకో నిర్వహిస్తున్న సిటు ప్రతినిధులు

పరవాడ: నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలిగించే బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని చేస్తున్న ఉద్యమాన్ని అణగదొక్కేందుకు ఉద్యమకారుల్ని ప్రభుత్వం నిర్బంధించడం దుర్మార్గపు చర్య అని సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఖండించారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిటు ఆధ్వర్యంలో పరవాడ సినిమా హాల్ కూడలి వద్ద బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న మత్స్యకారులపై కూటమి ప్రభుత్వం కేసులతో వేధింపులకు పాల్పడడం సహించబోమన్నారు. కాకినాడ తీరం తొండంగి వద్ద వచ్చిన పరిశ్రమను అక్కడి మత్స్యకారులు, రాజకీయ పక్షాలు వ్యతిరేకించడంతో దాన్ని నక్కపల్లికి తీసుకువచ్చారని ఆరోపించారు. మత్స్యకారులకు మద్దతుగా తాము సైతం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ, ప్రతినిధులు నాయుడు, బి.శ్రీను, సత్తిబాబు, రమణ, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'కూటమి నాయకులు చెప్పినవారికే యూరియా'

పరవాడ: రైతులకు యూరియా దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వంలోని నాయకులు యూరియా సరఫరాను పక్కదోవ పట్టిస్తున్నారని వైఎస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు ఆరోపించారు. కూటమి నాయకులు సూచించిన వారికే 15 నుంచి 20 బస్తాల యూరియాను అధికారులు ఇస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సాక్షితో మాట్లాడుతూ బుధవారం పరవాడ మండలానికి ఒక లోడు యూరియా వచ్చిందని, కానీ కొంత మంది తమ కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల్ని పరిగణలోకి తీసుకుని సగటున 15 బస్తాలు ఇచ్చారని ఆరోపించారు. వారికి భూమి ఎంత ఉంది? ఎంత అవసరం ? అని చూడకుండానే కేవలం ఆధార్ కార్డులనే పరిగణలోకి తీసుకుని యూరియా ఇవ్వడంతో అవసరమైన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రైతులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా యూరియాను ఇష్టానుసారం పంపిణీ చేయడమేంటని ఆక్షేపించారు. దీనిపై మండల వ్యవసాయాధికారిని వివరణ కోరగా.. కలెక్టర్ సమావేశంలో ఉన్నానంటూ ఫోన్ కట్ చేశారని పేర్కొన్నారు.

బాధితుడికి బ్రేస్‌లెట్ అప్పగింత



బాధితుడికి బ్రేస్‌లెట్ అప్పగిస్తున్న దేవస్థాన డిప్యూటీ ఈవో రాధ

సింహాచలం: సింహాద్రి అప్పన్న దర్శనానికి వచ్చి బంగారు మండ చైను(బ్రేస్‌లెట్) పోగొట్టుకున్న భక్తుడి వద్దకు తిరిగి ఆ ఆభరణం చేరింది. వివరాలివి.. నగరానికి చెందిన బండి వరహాలరాజు కుటుంబంతో కలిసి గత శనివారం సాయంత్రం అప్పన్న దర్శనానికి వచ్చాడు. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణంలో అతడి చేతికి ఉన్న రెండు తులాల బ్రేస్‌లెట్ జారిపోయింది. దీనిపై వెంటనే బాధితుడు దేవస్థానం పోలీసులకు ఫిర్యాదు చేసి వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి దర్శనానికి వచ్చిన గాజువాక ప్రాంతానికి చెందిన జి.తిరుపతిరావు, పి.రాజుకు ఆ బ్రేస్‌లెట్ దొరికింది. వెంటనే దేవస్థానంలో విధుల్లో ఉన్న హోంగార్డు భవానికి దాన్ని అందించారు. ఈవో త్రినాథరావు ఆదేశాల మేరకు బుధవారం దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో బాధితుడు వరహాలరాజుకు డిప్యూటీ ఈవో సింగం రాధ ఆ ఆభరణాన్ని అప్పగించారు. దేవస్థానం పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా వీధి దీపాల నిర్వహణ



అగనంపూడి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో అంధకారం

అగనంపూడి: జీవీఎంసీ విద్యుత్ దీపాల నిర్వహణ తీరుపై అగనంపూడివాసుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. 85వ వార్డు అగనంపూడి మరిడిమాంబ కూడలి నుంచి సినిమా హాలు రోడ్డు, దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డులో వీధి దీపాలు కొన్ని రోజులుగా వెలగట్లేదు. మరిడిమాంబ ఆలయ కూడలిలోని అధునాతన వీధిదీపాలు కూడా మసకబారాయి. హైవేపై ఉన్న సెంట్రల్ లైటింగ్ వెలుగులు కనుమరుగయ్యాయి. సెక్టార్-2, 3లోని పలు వీధుల్లో అరకొరగా వెలుగుతున్నాయి. చిన ఆంజనేయస్వామి ఆలయం కూడలి నుంచి సెక్టార్-3కి వెళ్లే మార్గంలోనూ ఇదే పరిస్థితి. సెక్టార్-2 నుంచి 3కి వెళ్లే రింగ్ రోడ్డులో కూడా వీధి దీపాల తీరు అలాగే ఉండడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క వర్షాలకు రోడ్లు ఎక్కడికక్కడ గోతులు ఏర్పడ్డాయి. రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో వాహన చోదకులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వీధి దీపాల నిర్వహణపై జీవీఎంసీ విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బలిరెడ్డి నాగేశ్వరరావు నిరసన వ్యక్తం చేశారు.

నిరంతరం వెలుగులు..

కొండయ్యవలసలో పలుచోట్ల నిరంతరం దీపాలు వెలుగుతున్నాయి. నెల రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. హైస్కూల్‌కు వెళ్లే మార్గంలోనూ ఇదే పరిస్థితి. ఇవి నిరంతరం వెలగడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, ఇవి పోతే మళ్లీ కొత్తవి అమర్చడానికి నెలల సమయం పడుతుందని స్థానికులు వాపోతున్నారు.

అబ్దుల్ కలామ్‌కు ఘన నివాళి



కలాం ఇంగ్లీష్ అక్షరాల ఆకృతిలో విద్యార్థులు

పెందుర్తి: స్థానిక ఆదిత్యనగర్‌లోని యూనిక్ పాఠశాలలో దివంగత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ కోనేటి ఆదినారాయణ(నాని) ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు 'కలాం'అనే ఇంగ్లిష్ అక్షరమాల ప్రకారం నిల్చుని ఇండియన్ మిస్సైల్ మాన్‌కు అంజలి ఘటించారు.